క్లుప్తంగా


పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ షేకున్ బాను

ఆదోని సెంట్రల్: పేద క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను డాక్టర్ షేకున్ బాను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీహెచ్ఎస్ బాబురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పురపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిరంజన్ కుమార్, ఫయాజుద్దీన్ ఒక్కొక్కరు 10 మంది చొప్పున 20 మందిని దత్తత తీసుకొని ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువ చేసే సరుకుల కిట్టును అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ లలితమ్మ, టీబీ సెంటర్ సిబ్బంది సుబ్బమ్మ, పద్మావతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



ప్రార్థన చేస్తున్న పాస్టర్లు

ఆదోని సెంట్రల్: క్రమ శిక్షణ కలిగిన జీవితం అలవర్చుకోవాలని అనంతపురం జిల్లా చెన్నం నాయుని కోటకు చెందిన కతోలిక గురువు జోసఫ్ తంబి, ఆదోని బాల యేసు మందిరానికి చెందిన విచారణ గురువులు డీన్ కోలా విజయ్ కుమార్, కర్నూలుకు చెందిన ఫాదర్ జార్జ్ అన్నారు. లూర్థుమాత మహోత్సవాలను మంగళవారం బుధవారపేటలోని అర్‌సీఎం చర్చి, బాల యేసు మందిరంలో ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


198 మంది చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం



బాలుడికి మందు వేస్తున్న ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్, అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(అవోపా) ఆధ్వర్యంలో 8వ విడత స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేశారు. దాత ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో 198 మంది చిన్నారులకు మందు వేశారు. కార్యక్రమంలో అవోపా ఆదోని పట్టణాధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్న శెట్టి, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు అవార్డులు



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కాలేజీకి చెందిన పి.ఇమాన్‌ఖాన్ (అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్), ఎస్. మహబుబ్‌బాషా(అసోసియేట్ ప్రొఫెసర్)లు ఎన్‌పీటీఈఎల్ స్టార్స్ అవార్డును అందుకున్నారు. మంగళవారం కాలేజీలో అవార్డులు అందుకున్న ఇద్దరు అధ్యాపకులను కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుధాకర్ అభినందించారు. ఈఈసీ విభాగపతి డా. సువర్ణ, అన్ని విభాగాల అధిపతులు, నందకిషోర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చేయాలి



దీన్ దయాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోని అర్బన్: పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ స్ఫూర్తితో బీజేపీ ప్రతి కార్యకర్త ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేవిధంగా పని చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు దేశాయి చంద్రన్న, అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒకరైన దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, మండలాధ్యక్షుడు ఉషారాజ్, ఆదోని పట్టణ సెంట్రల్ అధ్యక్షుడు నాగార్జున, జిల్లా అధికార ప్రతినిధి విజయకృష్ణ, శ్రీనివాస్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు పూర్తయ్యేనో?

- తొమ్మిదేళ్ల క్రితం నిలిచిపోయిన స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులు
- గతంలో బిల్లులు మంజూరు చేయని టీడీపీ ప్రభుత్వం
- పనులు మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్
- అద్దె భవనంలో ఇబ్బంది పడుతున్న పొదుపు మహిళలు



గోనెగండ్లలో అసంపూర్తిగా నిలిచిపోయిన స్త్రీ శక్తి భవనం

గోనెగండ్ల: పొదుపు మహిళల సౌలభ్యం కోసం గతంలో ప్రభుత్వం ప్రతి మండలంలో స్త్రీశక్తి భవనాలు నిర్మించింది. తొమ్మిది సంవత్సరాల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం గోనెగండ్లలో స్త్రీ శక్తి భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే బిల్లులు మంజూరు చేయని కారణంగా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం మళ్లీ టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా బిల్లులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పొదుపు మహిళలు కోరుతున్నారు.


1,621 పొదుపు గ్రూపులు

మండలంలో దాదాపు 1,621 పొదుపు గ్రూపులు ఉన్నాయి. పొదుపు మహిళల సమావేశాలకు, ఇతర కార్యకలాపాల కోసం తొమ్మిదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం మండల కేంద్రంలో రూ.33 లక్షల నిధులతో స్త్రీ శక్తి భవనం నిర్మాణం చేపట్టింది. అయితే బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా కాంట్రాక్టరు మధ్యలోనే పనులు వదిలి వెళ్లారు. నేటికీ పనులు పూర్తి కాలేదు. గదుల్లో బండపరుపు, విద్యుత్ సౌకర్యం, రంగులు వేసే పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో మండల కేంద్రంలోఅద్దెభవనంలోకార్యలయంనడుపుతున్నారు.

సమావేశాలకు ఇబ్బంది

పొదుపు మహిళలకు సంబంధించి ఏ సమావేశం జరుపుకోవాలన్నా ప్రస్తుత అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. ఇరుకు గదులలో ఇబ్బందులు పడుతూ సమావేశాలు జరుపుకుంటున్నారు. కేవలం సంఘాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు హాజరైనా సమావేశ నిర్వహణ ఇబ్బందిగానే మారుతోంది. నూతన స్త్రీ శక్తి భవనంలో మిగిలిన కొద్దిపాటి పనులు చేయించడంలో పాలకులు, అధికారులు చొరవ చూపాలని, ఈఏడాదైనా భవనాన్ని అదుబాటులోకి తీసుకురావాలని పొదుపు మహిళలు కోరుతున్నారు.


అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతాం



స్త్రీ శక్తి భవన నిర్మాణానికి అప్పట్లో మంజురైన నిధులతో భవన నిర్మాణం చేట్టారు. భవనం పూర్తి కావడానికి అదనపు నిధులు అవసరం. భవనం పూర్తిచేయడానికి అదనపు నిధుల కోసం రూ.10లక్షల వరకు ప్రపోజల్స్ పంపిస్తాం. నిధులు వచ్చిన వెంటానే భవన నిర్మాణ పనులు చేపడతాం.

– శివ శంకర్, పీఆర్ఏఈ గోనెగండ్ల

పూర్తి చేయించాలి



నూతన స్త్రీ శక్తి భవనాన్ని పూర్తి చేయించాలి. మహిళలు సమావేశం జరుపుకోవాలంటే ప్రస్తుతం ఉన్న కార్యాలయంలో ఇబ్బందిగా ఉంది. అధికారులు కూర్చోవడానికి కూడా స్థలం ఉండదు. నాయకులు, అధికారులు చొరవ తీసుకొని వెంటనే పూర్తి చేయించాలి.

– మమత, గ్రామైక్య సంఘం లీడర్, గోనెగండ్ల

అద్దె భవనంలో ఉన్నాం

స్త్రీ శక్తి భవనం పూర్తి కాకపోవడంతో సమావేశాలకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం అద్దె భవనంలో కార్యాలయం నడుపుతున్నాం. స్త్రీ శక్తి భవనం నిర్మాణాన్ని పూర్తి చేయించేందుకు ఎస్టీమేషన్ వేసి ఇవ్వాలని పంచాయతీ రాజ్ అధికారులను సంప్రదించాం. వారు ఎస్టీమేషన్ వేసి ఇచ్చిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

– హేమలత, ఏపీఎం, గోనెగండ్ల

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధితులకు నగదును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రంలోని కడపాళెం వీధిలో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ గృహసారథి కౌతాళం పార్వతి, నాగరాజు దంపతుల గుడిసె విద్యుత్ షార్ట్ షర్క్యూట్ ఈనెల 7వ తేదీన కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్నఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదంపతులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే తరుపున వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఎంపీపీ ఈరన్నతో కలిసి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే అందజేసిన నగదును, రెండు జతల బట్టలను బాధితులకు అందించారు. ఆ కుటుంబానికి రాంపురంరెడ్డి సోదరులు ఎల్లవేళలా అండగా ఉంటారన్నారు. వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు జగదీష్ స్వామి, మాజీ ఉరుకుంద ట్రస్ట్‌బోర్డు మెంబర్ బుళ్లి నరసింహులు, గానిగ వీరస్వామి, కాంట్రాక్టర్ నాగరాజు, ప్రతాప్, లోకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండల పరిధిలోని దుద్ది గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు తలారి సాదు రామయ్య పక్షపాతం వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమిత మయ్యాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని రామయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తరుపున వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామ నాయకులు నాగేష్, రామలింగలు ఉన్నారు.


ముప్పై పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

పెద్దకడబూరు: మండలంలో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 26గ్రామాలు ఉన్నాయని, రోజు రోజుకు పెరిగిపోతున్న జనాభాకు ఇప్పుడున్న ఆస్పత్రి సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జాఫర్ పటేల్, నాయకులు తిక్కన్న, ఇర్ఫాన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

దోమలను నివారించాలి

కోసిగి: మండల కేంద్రం కోసిగి దోమలు విపరీతంగా పెరిగి పోయాయని, వాటి వ్యాప్తిని నివారించాలని కోసిగి మండల జైభీమ్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పందికోన రాజేష్ డిమాండ్ చేశారు. ఆయన కోసిగి డ్రైనేజీ కాల్వలు పూర్తిగా నిండిపోయాయని, చెత్తాచెదారం రోడ్లపై పేరుకుపోవడంతో దోమలు పెరిగి పోయాయన్నారు. దీంతో ప్రజలు అంటురోగాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

మంత్రాలయం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకృతి వైపరీత్యాలను ఎలా ఎదుర్కోవాలని అనే అంశం పై ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు మంగళవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, వరదలు వచ్చిన సమయాల్లో ప్రాణాలు ఎలా రక్షించుకోవాలో రిస్క్ టీం ప్రాక్టికల్‌గా విద్యార్థులకు వివరించారు.

చెట్నేహళ్లిలో అధికారుల పర్యటన



గ్రామస్తులను విచారిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మంత్రాలయం: మండల పరిధిలోని చెట్నేహళ్లి గ్రామంలో కొద్ది రోజులుగా శ్మశానవాటిక స్థలం కోసం రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం జరుగుతున్న విషయం తెలిసిందే. మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామానికి చెందిన పలువురు పెద్దలను వేర్వేరుగా తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి వెళ్లి వివాదానికి కారణమైన భూములను పరిశీలించి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, సీఐ రామంజులు, ఎస్ఐ శివాంజల్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



సిద్ధరూఢ స్వామికి హారతులు పడుతున్న షణ్ముఖరూఢ మఠం పీఠాధిపతి అభినవ సిద్ధరూఢ మహాస్వామి

కోసిగి: ప్రతి ఒక్కరూ ఆధ్యాతిక చింతన అలవర్చుకోవాలని సద్గురు ఆరూఢజ్యోతి శ్రీషణ్ముఖరూఢ మఠం పీఠాధిపతులు అభినవ సిద్ధరూఢ మహాస్వామి, గవిమఠ సంస్థాన పీఠాధిపతి కరిబసవరాజేంద్ర మహాస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కొలువైన శ్రీ సిద్ధరూఢ స్వామి నవమ వార్షికోత్సవ వేడుకలు రెండవ రోజున భక్తి శ్రద్ధలతో కొనసాగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చేపట్టిన ఉపన్యాస కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక రాష్ట్రం బీజాపురం శ్రీషణ్ముఖరూఢ మఠం పీఠాధిపతులు అభినవ సిద్ధారూఢ మహాస్వాములు, ఉరవకొండ గవిమఠ సంస్థాన పీఠాధిపతులు కరిబసవ రాజేంద్ర మహాస్వాములు, సద్గురు శివానంద స్వామి, సద్గురు ప్రణావనంద స్వామి హాజరయ్యారు.


ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి



తుంగభద్ర నదిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం మొద్ద నిద్ర వీడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. రైతు సంఘం నాయకులు, రైతులతో కలిసి తుంగభద్ర నదిని మంగళవారం పరిశీలించారు. కౌతాళంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం నదిపై బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణానికి పూనుకుంటోందని, అయినా మన ప్రభుత్వం మొద్ద నిద్ర విడడం లేదన్నారు. బ్యారేజ్ వల్ల మనకు జరిగే లాభం ఏమిటో తెలుసుకుని ముందుకు పోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. కింద స్థాయి వారికి నష్టం జరుగకుండా వెంటనే కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈ పనుల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ నిర్మాణం పూర్తి అయితే జిల్లాలోని పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలంగా మారి వలసలు నివారించవచ్చన్నారు. తుంగభద్ర నదిపై మేలిగనూరు వద్ద వరద కాలువ నిర్మించాలని దానితో పాటు కూడి కెనాల్‌ను నిర్మించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ సుబ్బారాయుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల అధ్యక్షుడు ఈరన్న పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి

ఆదోని రూరల్: మిర్చి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి అన్నారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి రైతుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోకుండా కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. మిరప ధరలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని, దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. మిరప పంటకు గిట్టుబాటు ధరలు అందించాలన్నారు. బ్యాడిగ మిరపకు రూ.50 వేలు, మిగతా రకాలకు క్వింటాల్‌కు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 17వ తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, మల్లయ్య, జిల్లా కమిటీ స భ్యులు అయ్యప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి, తుంగభద్ర నది జలాన్ని తీసుకొస్తున్న తొగటవీర క్షత్రీయులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి తెల్లవారిజాము నుంచి ఆలయ అర్చకులు మహాగణపతి పూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పుష్పార్చన, శతనామావళి, ఆకుపూజతో పాటు మహామంగళ హారతులు చేపట్టారు. అనంతరం తొగట వీరక్షత్రీయ కుల బాంధవులతో పాటు గ్రామస్తులు పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్థానిక మల్లికార్జున స్వామి ఆలయం నుంచి అమ్మవారి అభిషేకం కోసం తీసుకొచ్చిన తుంగభద్ర నది జలాన్ని జ్యోతులలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. భజనలు, ఆడపడుచులు కలశాలతో స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న అనంతరం తుంగా జలంతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. బుధవారం జరిగే జ్యోతి ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ అధ్యక్షుడు మఠం రామాంజినేయులు తెలిపారు.

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కోసిగి: మండల కేంద్రంలో ఈనెల 17న జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మంగళవారం ఎల్లమ్మ దేవి ఆలయం సందర్శించి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. అనంతరం ఆలయ పూజారి మూర్తి గౌడ, కంఠ గౌడలను కలిసి ఏర్పాట్లపై చర్చించారు. భక్తాదులకు తాగునీటి వసతి, భద్రత ఏర్పాట్లు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. జాతర రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఊరి బయటే వాహనాలు రాకపోకలు నిలిపివేసేలా చూడాలని కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్‌లను ఆదేశించారు. మంత్రాలయం సీఐ రామాంజులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

హౌసింగ్ బిల్లులను అప్‌లోడ్ చేయండి



మురుగుకాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఎం. కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ఎన్టీఆర్ కాలనీలో నిర్మించిన పక్కా గృహాల బిల్లులను సత్వరమే అప్‌లోడ్ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో 2872 ఇళ్లకు గానూ 1876 నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. మరో వెయ్యి ఇళ్లు వివిధ స్టేజీల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నిర్మాణం పనులకు సంబంధించిన బిల్లులను సత్వరమే పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని, 460 ఇళ్లకు బిల్లులు ఇవ్వాల్సి ఉందని, వెంటనే పూర్తి చేయాలని సంబంధిత వార్డు సచివాలయం ఇంజనీరింగ్ సెక్రటరీలను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లోగా హౌసింగ్ బిల్లుల ప్రక్రియను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

పట్టణ పరిశుభ్రతే లక్ష్యం

పట్టణ పరిశుభ్రతే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని 20, 21 వార్డుల పరిధిలోని ఎస్‌కేడీ కాలనీ, 1, 2వ రోడ్డులో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికను శానిటరీ వర్కర్లు తీసివేయించారు. పనులకు కమిషనర్ పరిశీలించారు. కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు మురుగు తీయించాలని సూచించారు. 42 వార్డుల పరిధిలో ఏ కాలువా పూడికతో నిండి కనిపించరాదన్నారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

ఎమ్మిగనూరురూరల్: పశ్చిమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని అఖిల భారత కూలీ సంఘం జిల్లా ప్రధాన క్యాదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో రైతాంగం, కూలీలు కరువు కాటకాలతో వలస వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. ఆర్డీఎస్, గుండ్రేవుల, వేదావతి ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి అయ్యేల చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు హనుమంతప్ప, నాగేంద్ర, పెద్దారెడ్డి, డివిజన్ నాయకులు నరసింహులు, ఉరుకుంద, రాఘవేంద్ర, మోనయ్య, ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.

సులభమైన పద్ధతిలో విద్య బోధన చేయాలి

నందవరం : విద్యార్థులకు సులభమైన పద్ధతిలో విద్య బోధన చేయాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ధర్మపురం గ్రామంలో ఎంపీపీఎస్, హాలహర్వి గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలు, నైపుణ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ సభ్యులు నిర్లక్ష్యం వహించకుండా నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

నందవరం : కౌలు రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి శాంతప్ప డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు నిరసన తెలిపి తహసీల్దార్ శ్రీనివాసులుకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు సమగ్ర చట్టం తీసుకువచ్చి, సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, పంటల బీమా, పెట్టుబడిసాయం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నరసయ్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ భవనం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ఇంటి స్థలాలు లేని లబ్ధిదారులతో కలిసి ర్యాలీ వెళ్లి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో వందలాది మంది ఇంటి స్థలాలు లేని నిరుపేదలు పూరి గుడెసెల్లో, అద్దె ఇళ్లలో నివసిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు సెంట్ల స్థలం ఇంటి నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు టి.వీరేష్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శులు ఎ.విజయ్, లక్ష్మీనారాయణ, కుమారస్వామి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్. నం.: 72

(APMACS చట్టం, 1995 క్రింద నమోదైనది) RBI లైసెన్స్ నం: UBD, AP, 1671 P
#XIII/172, 173, ఫ్లవర్ బజార్, ఆదోని – 518 301, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.

స్వాధీనతా ప్రకటన (లాంఛనప్రాయం)

రూల్ 4,8(1) & 8(2) క్రింద (చర మరియు స్థిరాస్తుల కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.** అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **30-11-2024 తేదీ గల డిమాండ్ నోటీస్** జారీచేసి దిగువ తెలిపిన **ఋణగ్రహీతలు: 1) నాగలాపురం రామకృష్ణారెడ్డి తండ్రి N. నరసింహారెడ్డి**, LIG నం.101, APHB కాలనీ, ఆదోని-518301, **2) A. సునీత భర్త నాగలాపురం రామకృష్ణారెడ్డి**, LIG నం.101, APHB కాలనీ, ఆదోని-518301, **MTL A/C No 200230041000405** వారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తం **30-11-2024** నాటికి **రూ.45,26,903/- (నలభై ఐదు లక్షల ఇరవై ఆరు వేల తొమ్మిది వందల మూడు రూపాయలు మాత్రమే)** తిరిగి చెల్లించవలసిందిగా కోరారు. **30-11-2024** నుండి వర్తింపుతో కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్య త్ వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥వి కూడా చెల్లించుటకు మీరు బాధ్యులై ఉన్నారు.

ఋణగ్రహీత సదరు మొత్తాన్ని చెల్లించుటంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ ఇందులో వివరించిన, బ్యాంకుకు తనఖాపెట్టిన ఆస్తులను దిగువ సంతకందారు **06-02-2025**న స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీత/గ్యారంటార్లు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభ్యమగు సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించవలసిందిగా ఋణగ్రహీతను కోరడమైనది. సెక్యూర్డ్ క్రెడిటార్‌చే అయిన అన్ని వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో పాటు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బకాయి మొత్తాన్ని సెక్యూర్డ్ ఆస్తుల లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం బహిరంగ వేలం లేదా ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండరు కోరడం లేదా ప్రైవేట్ ఒప్పందం కోసం ప్రకటన ప్రచురణ తేదీలోగా ఏ సమయంలోనైనా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించినట్లయితే (i) సెక్యూర్డ్ ఆస్తులు లీజ్, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా సెక్యూర్డ్ క్రెడిటార్‌చే బదిలీ చేయబడవు, మరియు (ii) ఈ ఉప-సెక్షన్ క్రింద అట్టి మొత్తం చెల్లించేలోగా ఆస్తుల లీజు లేదా అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం సెక్యూర్డ్ క్రెడిటార్‌చే ఏదేని చర్య తీసుకున్నట్లయితే, సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం యొక్క లీజు లేదా అసైన్‌మెంట్ ద్వారా బదిలీ కోసం సెక్యూర్డ్ క్రెడిటార్‌చే ఎలాంటి తదుపరి చర్య తీసుకోబడదు

సదరు ఆస్తులతో ఎలాంటి వ్యవహారములు జరుపరాదని మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారమైనా **రూ.46,13,652/- (నలభై ఆరు లక్షల పదమూడు వేల ఆరు వందల యాభై రెండు రూపాయలు మాత్రమే)** + కాంట్రాక్చువల్ రేటు వంతున వడ్డీ + అనుషంగిత ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥వ వాటి మొత్తం కొరకు **శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.** చార్జీకి లోబడి ఉంటాయని ముఖ్యంగా ఋణగ్రహీత/గ్యారంటార్లను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

షెడ్యూలు-C

పార్ట్ - I: (డాక్యుమెంట్లలో తెలిపిన తాకట్టుపెట్టిన అన్ని ఆస్తులు అనగా స్టాక్స్, బుక్ డెట్స్, రిసీవబుల్స్, కన్స్యూమబుల్ స్టోర్ & స్పేర్స్‌తో సహా కరెంట్ అస్సెట్స్ మరియు తాకట్టు పెట్టిన మూవబుల్స్, ప్లాంట్ & మెషినరీ మొ॥వి తెలపండి)
పార్ట్ - II: (మార్టగేజ్ డాక్యుమెంట్స్/డీడ్స్‌కు సంబంధం కలిగి డాక్యుమెంట్లలో తెలిపిన విధంగా బ్యాంక్‌కు తనఖాపెట్టిన స్థిరాస్తుల వివరాలు తెలపండి)

ఆస్తుల షెడ్యూల్

1) N. రామకృష్ణారెడ్డి తండ్రి N. నరసింహారెడ్డి పేరున ఉంది, సబ్‌రిజిస్ట్రేషన్ జిల్లా ఆదోని మరియు రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు, ఆదోని, APHB కాలనీ, వార్డ్ నం.1, రవి ఎస్టేట్, L.P. నం.18/95, సర్వే నం.220/B, 220/D మరియు 221, నం.37 (సౌత్ పోర్షన్) కలిగిన ఖాళీ ప్లాట్ యావత్తు. **సైట్ కొలతలు:** తూర్పు-పశ్చిమం (ఉత్తరం): 60 అడుగులు, తూర్పు-పశ్చిమం (దక్షిణం): 65 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 30 అడుగులు, విస్తీర్ణం 208.33 చ.గజాలు. **ప్లింత్ ఏరియా: ఖాళీ ప్రదేశంలో నిర్మించిన బేస్‌మెంట్:** తూర్పు-పశ్చిమం: 50 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 23.1 అడుగులు విస్తీర్ణం 1150.00 చ.అడుగులు. **సరిహద్దులు: తూర్పు:** 40 అడుగుల వెడల్పు కాలనీ రోడ్డు, **పశ్చిమం:** ప్లాట్ నం.36, **ఉత్తరం:** A. సునీత విక్రయించిన ప్లాట్ భాగం, **దక్షిణం:** ప్లాట్ నం.38లోని మధ్య పోర్షన్.

2) A. సునీత భర్త N. రామకృష్ణారెడ్డి పేరున ఉంది, సబ్‌రిజిస్ట్రేషన్ జిల్లా ఆదోని మరియు రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు, ఆదోని, APHB కాలనీ, వార్డ్ నం.1, రవి ఎస్టేట్, L.P. నం.18/95, సర్వే నం.220/B, 220/D మరియు 221, నం.37 భాగం (నార్త్ పోర్షన్) కలిగిన ఖాళీ ప్లాట్ యావత్తు. **సైట్ కొలతలు:** తూర్పు-పశ్చిమం (ఉత్తరం): 55 అడుగులు, తూర్పు-పశ్చిమం (దక్షిణం): 60 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 30 అడుగులు, విస్తీర్ణం 191.66 చ.గజాలు. **ప్లింత్ ఏరియా: ఖాళీ ప్రదేశంలో నిర్మించిన బేస్‌మెంట్:** తూర్పు-పశ్చిమం: 50 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 23.1 అడుగులు విస్తీర్ణం 1154.00 చ.అడుగులు. **సరిహద్దులు: తూర్పు:** 40 అడుగుల వెడల్పు కాలనీ రోడ్డు, **పశ్చిమం:** ప్లాట్ నం.36, **ఉత్తరం:** 33 అడుగుల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** విక్రయించిన ప్లాట్ పై N. రామకృష్ణారెడ్డి మధ్య పోర్షన్.

తేది : 06.02.2025 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఆదోని — శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని